సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 4 । నవంబర్ । 2023



వేగంగా.. సులభంగా!
సమాచారం వేగంగా తెలుసుకునేలా ఎన్నికల కమిషన్ పలు వెబ్‌సైట్లు, యాప్‌లను అందుబాటులోకి తెచ్చింది.
IIలో



మావోల విధ్వంసం
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా దండకారణ్యంలో మావోయిస్టులు రెండు వాహనాలను దగ్ధం చేశారు.
IIలో

గరిష్టం / కనిష్టం
30° / 22°

వాతావరణం
జిల్లాలో శనివారం వాతావరణం చల్లగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలో శుక్రవారం మూలమూర్తులు స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచ: మండలంలోని శ్రీకనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో శుక్రవారం అమ్మవారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలతో హారతి సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, పూజలు గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.రజనీకుమారి, ఆలయ పాలక మండలి చైర్మన్ మహిపతి రామలింగం తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 11న ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. రుద్రాభిషేకంలో పాల్గొనే భక్తులు వివరాలకు 98669 23261 నంబరులో సంప్రదించాలని కోరారు.

న్యాయమూర్తి నీరజకు జిల్లా జడ్జిగా పదోన్నతి



ఎ. నీరజ



డీ.వీ.నాగేశ్వరరావు

కొత్తగూడెంటౌన్: రాష్ట్రంలో 15 మంది సివిల్ జడ్జిలకు జిల్లా జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కొత్తగూడేనికి చెందిన, అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎ.నీరజకు స్థానం లభించింది. అలాగే, కొత్తగూడెం బార్ అసోసియేషన్ మాజీ సభ్యుడైన డీ.వీ.నాగేశ్వరరావు(నగేష్) హుజురాబాద్‌లో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ, ఖమ్మం బార్ అసోసియేషన్ మాజీ సభ్యుడైన కె.మురళీమోహన్ భువనగిరి సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తూ, మందా వెంకటేశ్వరావు వరంగల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ పదోన్నతులు పొందారని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్ తెలిపారు. ఈసందర్భంగా పదోన్నతి పొందిన న్యాయమూర్తులకు రమేష్‌తోపాటు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

సెస్ పరీక్షల పరిశీలన



ప్రశ్నపత్రాలను అందజేస్తున్న డీఈజీ వెంకటేశ్వరాచారి

మణుగూరు టౌన్: జెడ్పీ కోఎడ్యుకేషన్ హైస్కూల్‌లో ఎస్ఈఏఎస్(స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే)లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన మూల్యాంకన పరీక్షను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి పరిశీలించారు. ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థుల్లో నైపుణ్యాలను అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నారు. తొలుత ప్రశ్నపత్రాలు అందజేశారు. పరీక్ష అనంతరం హెచ్‌ఎం నాగశ్రీకి పలు సూచనలు చేశారు.

టికెట్ల తకరారు!

మొదలైన అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

- ఇంకా అభ్యర్థులను ప్రకటించని ప్రధాన పార్టీలు
- మీనమేషాలు లెక్కిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల వేడి నువ్వా – నేనా అన్నట్టుగా తారాస్థాయికి చేరుకుంటోంది. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు అభ్యర్థుల ప్రకటన విషయంలో తాత్సారం చేస్తున్నాయి. దీంతో ఆయా పార్టీల ఆశావహులు క్షేత్రస్థాయిలో ప్రచారం చేయడం కంటే టికెట్ దక్కించుకునేందుకు చేయాల్సిన లాబీయింగ్ మీదనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించాల్సి వస్తోంది. నామినేషన్ల ప్రక్రియ మొదలైనా ఆ పార్టీల నుంచి అన్ని స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు ఎవరనే అంశంపై స్పష్టత రావడం లేదు. ఇక కాంగ్రెస్‌కు కటీఫ్ చెప్పిన సీపీఎం జిల్లాలో అశ్వారావుపేట, భద్రాచలం నుంచి పోటీలో ఉంటామని చెప్పింది. అయితే అభ్యర్థులను ప్రకటించలేదు.

సీఎం కేసీఆర్ ప్రచారం

రాబోయే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని రెండు నెలలు ముందుగానే భారత రాష్ట్ర సమితి పార్టీ జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఆ తర్వాత బీ ఫామ్స్ సైతం అందచేసింది. దీంతో గడిచిన నెలరోజులుగా గులాబీ పార్టీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత అక్కడక్కడా తలెత్తిన అసమ్మతిని కాచుకుంటూ రాబోయే ఎన్నికల్లో తమ గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఇల్లెందు అభ్యర్థి హరిప్రియ నాయక్ తరఫున ఆ పార్టీ అధినేత సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగే సభ కోసం మరోసారి జిల్లాకు కేసీఆర్ రానున్నారు.

ఎడతెగని పొత్తు పంచాయితీ

కాంగ్రెస్, సీపీఐల మధ్య పొత్తు అంశం ఒక అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్నట్టుగా మారింది. నామినేషన్లు మొదలైన ఇంకా ఈ పంచాయితీ తెగడం లేదు. దీంతో ఇక్కడ ఎవరు పోటీలో ఉంటారనేది ఆసక్తికరంగా మారింది. దాదాపు పొత్తులు ఉండవనే ప్రచారం బలంగా సాగుతున్నా .. ఇరు పార్టీలో ఈ విషయంలో స్పష్టత ఇవ్వకుండా నాన్చుడు ధోరణి అవలంభిస్తున్నాయి. దీంతో ఇక్కడ సీపీఐ నుంచి ఎవరు పోటీ చేయాలనే అంశం ఆ పార్టీలో పరస్పర విరుద్ధమైన అభిప్రాయాలకు కారణమైంది. ఇక కాంగ్రెస్ నుంచి బీసీ అభ్యర్థికే టికెట్ ఇవ్వాలంటూ నాగసీతారాములు, ఎడవల్లి కృష్ణలు బలంగా డిమాండ్ చేస్తున్నారు. అయితే హస్తం గుర్తు ఇక్కడ ఉంటుందా లేదా అనే అంశంపై ఆ పార్టీ నేతల్లోనే గందరగోళం నెలకొంది. ఇల్లెందులో దాదాపు కోరం కనకయ్యకు టికెట్ ఖరారు అనే పరిస్థితి రెండు వారాల కిందటి వరకు ఉంది. కానీ బంజారాలకే కేటాయించాలంటూ ఆ వర్గానికి చెందిన నేతలు బలంగా తమ వాణి వినిపించారు. దీంతో ఇల్లెందులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రకటన పెండింగ్‌లో పడింది. టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్న నేతలు ప్రచారం కంటే కూడా ఢిల్లీలో లాబీయింగుల్లో బిజీగా ఉన్నారు.

పూర్తిగా వికసించని కమలం

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ల కంటే ముందే జిల్లాలో బీజేపీ ఎన్నికల ప్రక్రియ మొదలు పెట్టింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించారు. కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎన్నికల షెడ్యూల్ రావడమే ఆలస్యం అనే విధంగా సంస్థాగతంగా సిద్ధమయ్యారు. తీరా షెడ్యూల్ విడుదలయ్యాక ఆ వేగం చూపించడంలో కమలం పార్టీ విఫలమవుతోంది. ఇప్పటివరకు భద్రాచలం, ఇల్లెందు, పినపాక నియోజకవర్గాలకే అభ్యర్థులను ఖరారు చేసింది. అశ్వారావుపేటతోపాటు కీలకమైన కొత్తగూడెం స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదు.

రెండు స్థానాల్లోనే కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారు

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ఓటు బ్యాంకు ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో కాంగ్రెస్, ఒక్క స్థానంలో కాంగ్రెస్ మద్దతులో టీడీపీ అభ్యర్థిగా మెచ్చా నాగేశ్వరరావు విజయం సాధించారు. ఎన్నికల షెడ్యూల్ రావడానికి ముందే కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న నేతలు ఎవరికి వారుగా ప్రచారం చేసుకుంటూ పోయారు. తొలి జాబితాలో కేవలం భద్రాచలం నుంచి పొదెం వీరయ్యకు అవకాశం రాగా మలి జాబితాలో పినపాక నుంచి పాయం వెంకటేశ్వర్లు అభ్యర్థిత్వం ఖరారైంది. ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేటలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించలేదు.

ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల, పక్కన ఎస్పీ వినీత్

- కలెక్టరేట్‌లో నోటిఫికేషన్ విడుదల
- 10వ తేదీ వరకు నామినేషన్లు
- 26,693 మంది నూతన ఓటర్లు
- పోలింగ్ విధులకు 5,288 మంది
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు : ఎస్పీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం ఆమె కలెక్టరేట్‌లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం ఎస్పీ డాక్టర్ వినీత్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు ఐదు నియోజకవర్గాల్లో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 5వ తేదీ సెలవు కావడంతో ఆ రోజు నామినేషన్లు వేసే అవకాశం ఉండదన్నారు. నామినేషన్ల ప్రక్రియపై అవగాహనకు ప్రత్యేక హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు ఎవరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందని, మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని వివరించారు. 10వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామని, 13వ తేదీ పరిశీలన ఉంటుందని, 15వ తేదీ వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్‌కు వచ్చే వాహనాలు, ర్యాలీలు, ప్రచార మెటీరియల్ తదితర ఖర్చులను అభ్యర్థి ఖర్చులుగా జమచేస్తామని తెలిపారు. ఎన్నికల సంఘం జిల్లాకు ఇద్దరు వ్యయ పరిశీలన అధికారులుగా గితేష్‌కుమార్, సతీష్ చంద్రలను నియమించిందన్నారు.

9,45,094 మంది ఓటర్లు..

జిల్లాలోని 1,095 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 9,45,094 మంది ఉన్నారని, వారిలో 4,61,315 మంది పురుషులు, 4,83,741 మంది మహిళలు, 38 మంది ట్రాన్స్‌జెండర్లు, 43 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు, 731 మంది సర్వీస్ ఓటర్లు, 14,930 మంది దివ్యాంగులు, 18–19 సంవత్సరాల వయస్సు ఉన్న యువ ఓటర్లు 22,096 మంది, 80 సంవత్సరాలు పైబడిన వారు 13,082 మంది ఉన్నారని వివరించారు. సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 31వ తేదీ వరకు 26,693 మంది నూతన ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, వారిలో ఇప్పటి వరకు 11,473 మంది వివరాలు ఆన్‌లైన్ చేశామని అన్నారు. మిగిలిన 15,220 దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ లోగా ఆన్‌లైన్ పూర్తి చేస్తామన్నారు.

12 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు...

288 తీవ్రవాద సమస్య ఉన్న పోలింగ్ కేంద్రాలు, 12 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ప్రశాంత పోలింగ్‌కు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియలో 1,095 మంది పీఓలను, 1,095 మంది ఏపీఓలను 1,095 మంది ఓపీఓలు, రిజర్వులో 908 మంది కలిపి మొత్తం 5,288తో జాబితా సిద్ధం చేసినట్లు వివరించారు. ఆరుగురు నోడల్ అధికారులు, 21,174 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఫారం 12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఇస్తున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన సిబ్బంది ఆర్ఓ కార్యాలయంతో పాటు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, శిక్షణాతరగతులు నిర్వహించే కేంద్రాల్లో ఓటు వేసేందుకు అవకాశం ఉందన్నారు.

మౌలిక సౌకర్యాల ఏర్పాటు..

అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, వీల్ చైర్లు, ర్యాంపులు వంటి మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో మహిళలకు 5 పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగులకు 1, ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు 5, యువతకు 5 ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 80 సంవత్సరాలు పైబడిన వారికి, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి వద్ద నుండే ఫారం 12డి ద్వారా ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు.

'సీ విజిల్'లో 96 ఫిర్యాదులు

సీ విజిల్ యాప్‌కు 96 ఫిర్యాదులు అందగా, అన్నింటినీ పరిష్కరించినట్లు తెలిపారు. 1950 కాల్ సెంటర్‌కు 1,174 ఫిర్యాదులు రాగా నిర్ణీత సమయంలోగా అన్నింటిని పరిష్కరించినట్లు చెప్పారు. వచ్చిన ఫిర్యాదులలో ఎక్కువ శాతం నూతన ఓటరు నమోదు, ఎపిక్ కార్డులకు సంబంధించినవి ఉన్నాయని తెలిపారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగితే సి విజిల్ యాప్ ద్వారా, 1950 కంట్రోల్ రూంలకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. 16 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, 15 చెక్ పోస్టులు, 21 వీడియో సర్వైలెన్స్ టీంలు, 5 వీడియో వ్యూయింగ్ టీంలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రూ.4.81 కోట్ల సొత్తు సీజ్

ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చాక రూ.2,54,61,291 నగదు, 32,47 లీటర్ల మద్యం, 2,059 కేజీల డ్రగ్స్, 2,635 గ్రాముల వెండి, ఫ్రీ బీజెడ్ ఐటమ్స్ 5,534.. మొత్తం రూ.4,81,70,963 విలువైన సొత్తు సీజ్ చేసినట్లు వివరించారు. సీజ్ చేసిన వాటిలో 92 కేసులకు సంబంధించి రూ.19.15 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. ఇంకా ఆరు కేసులకు సంబంధించి రూ.18 లక్షలు విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. 2018 ఎన్నికల్లో పోలింగ్ తక్కువగా జరిగిన 164 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో డీపీఆర్వో ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తొలిరోజు మూడు నామినేషన్లు



ఇల్లెందులో నామినేషన్ వేస్తున్న పోలెబోయిన రవి



కొత్తగూడెంలో నామినేషన్ వేస్తున్న సతీష్

సూపర్‌బజార్(కొత్తగూడెం): శాసనసభ ఎన్నికల ప్రక్రియలో శుక్రవారం కీలక నామినేషన్ల ఘట్టం ప్రారంభమైంది. తొలిరోజు జిల్లాలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులు గుండపనేని సతీష్, ఇమంది ఉదయ్‌కుమార్‌లు కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల అధికారి శిరీషకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి పోలెబోయిన రవి నామినేషన్ వేశారు. అక్కడి ఎన్నికల అధికారి కాశయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. మిగిలిన అశ్వారావుపేట, పినపాక, భద్రాచలం నియోజకవర్గాల్లో తొలిరోజు ఎవరూ నామినేషన్ వేయలేదు.

సీఎం సభకు భారీ బందోబస్తు

రేపు మధ్యాహ్నం 12 గంటల తర్వాత ట్రాఫిక్ ఆంక్షలు



డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంటౌన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 5న కొత్తగూడెంలో జరగనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ రానుండటంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన చేశారు. అందరూ ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలని సూచించారు. కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో 5న సాయంత్రం ప్రజా ఆశీర్వాద సభ జరగనుందని, ముఖ్యమంత్రి భద్రతా కారణాల దృష్ట్యా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, ఆ సమయంలో భద్రాచలం నుంచి ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను కొత్తగూడెం పట్టణంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు. భద్రాచలం నుంచి పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు మీదుగా ఖమ్మం వెళ్లాలని, భద్రాచలం నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు పాల్వంచ నుంచి దమ్మపేట రోడ్, మాధారం, అన్నపురెడ్డిపల్లి మీదుగా ఎర్రగుంట వద్ద విజయవాడ రోడ్‌కు చేరుకోవాలని సూచించారు.

ఎన్నికల వ్యయ పరిశీలకులు వచ్చేశారు..



స్వాగతం పలుకుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు అజయ్ లాల్‌చంద్ సోనేజీ శుక్రవారం జిల్లాకు చేరుకున్నారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో ఆయనకు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ మొక్కను ఇచ్చి స్వాగతం పలికారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ నిర్వహణ తీరుపై వారు చర్చించుకున్నారు.


నామినేషన్ పత్రాలతో రాజధానికి..

వనమా మాదిరి చిక్కులు రాకుండా జాగ్రత్త

ఇల్లెందు: రిటర్నింగ్ అధికారుల నుంచి నామినేషన్ల పత్రాలు పొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు వాటిని పూర్తి చేసి న్యాయవాది పరిశీలనకు హైదరాబాద్ బాట పడుతున్నారు. నామినేషన్ దాఖలుకు ముందు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని బీఫాం అందజేసే రోజే సీఎం కేసీఆర్ అందరికీ హుకుం జారీ చేశారు. గడిచిన ఎన్నికల్లో కొందరి వల్ల జరిగిన పొరపాట్లతో న్యాయస్థానాల్లో చిక్కులు ఎదురుకోవాల్సివచ్చింది. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుపై ఈ తరహా కేసు సుప్రీ కోర్టులో ఉన్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోనే ఓ న్యాయవాదిని ఏర్పాటు చేసి అతను పరిశీలించాక నామినేషన్లు దాఖలు చేయాలని స్వయంగా సీఎం కేసీఆర్ ఆదేశించారు. దీంతో నామినేషన్ పత్రాలు తీసుకుని అభ్యర్థులు, వారి ప్రతినిధులు హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఏదైనా పొరపాటు సంభవిస్తే తామే బాధ్యత వహించాల్సి ఉంటుందని, సీఎం మాట పెడచెవిన పెట్టినవారమవుతామనే భయంతో అభ్యర్థులు రాజధానికి వెళ్తున్నారు. శుక్రవారం ఇల్లెందు అభ్యర్థి హరిప్రియ నామినేషన్ పత్రంతో ఆమె భర్త హరిసింగ్ హైదరాబాద్ వెళ్లినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

ఎంపీ నామా నాగేశ్వరరావు



ఎంపీ నామా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

చండ్రుగొండ : కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు చేరాయని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని అయన్నపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రెండు కళ్ల లాంటివని అన్నారు. మూడోసారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడుతుందని అన్నారు. అనంతరం గ్రామకమిటీలతో సమావేశమైసమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పల వెంకటరమణ కూడా మాట్లాడారు.

వైస్ ఎంపీపీ మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి..

మండల పరిషత్ వైస్ ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ తిరిగి ఎంపీ నామా సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల ఆయన మాజీ ఎంపీ పొంగులేటి నాయకత్వంలో కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. ఆయనతోపాటు దామరచర్ల సర్పంచ్ ఇరప లక్ష్మిపతి, ఎంపీటీసీ సంగొండి వెంకటకుమారి, నరుకుళ్ల అప్పాజి, పోట్రు నర్సింహారావులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, దార వెంకటేశ్వరరావు, రైతు సమన్వయ సమితి జిల్లా సమన్వయకర్త రావు జోగేశ్వరరావు, గాదె లింగయ్య, ఎస్డీ రసూల్, ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి, నల్లమోతు వెంకటనారాయణ, సూరా వెంకటేశ్వర్లు, భూపతి రమేష్, సీహెచ్ రామరాజు పాల్గొన్నారు.

తాటికి చేజారేనా..?

- అశ్వారావుపేట కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర పోటీ
- గట్టి ప్రయత్నాలు చేస్తున్న తాటి వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ
- 2018లో గులాబీ పార్టీలో వీరి మధ్యే టికెట్ పోరు
- ప్రస్తుత ఎన్నికల్లో హస్తం పార్టీలో అదే సీన్



తాటి వెంకటేశ్వర్లు



జారే ఆదినారాయణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ టికెట్ కోసం తాటి వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ పోటీ పడుతున్నారు. 2018లో కూడా వీరి మధ్యే టికెట్ పోరు నెలకొంది. అయితే అప్పుడు వీరిద్దరూ బీఆర్‌ఎస్‌లో ఉన్నారు. 2018, నవంబర్ 1న ఇదే విషయమై 'తాటి బీ–ఫామ్ 'జారే'నా?!' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. సరిగ్గా ఐదేళ్లకు మళ్లీ అదే పరిస్థితి పునరావృతమవుతోంది. 2018లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు టికెట్ దక్కించుకోగా, ఉద్యమ కాలం నుంచి పనిచేస్తున్న, ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన జారేకు కారు బాస్ హ్యాండిచ్చారు. తాటి, జారే వర్గపోరుతో వీరి ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి, మహాకూటమి(టీడీపీ) అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం మెచ్చా నాగేశ్వరరావు బీఆర్‌ఎస్‌లో చేరగా, సిట్టింగ్‌లకు టికెట్ అని ఏడాది క్రితమే సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో తాటి వెంకటేశ్వర్లు మునుగోడు ఉప ఎన్నికల కంటే ముందే కారు దిగి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇక జారే ఆదినారాయణ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డితోపాటు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో మళ్లీ తాటి, జారే మధ్యనే టికెట్ పోరు నెలకొంది.

జారే కోసం పొంగులేటి పట్టు!

అశ్వారావుపేట టికెట్ జారే ఆదినారాయణకు ఇవ్వాలని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. 2018 ఎన్నికల్లో కొందరు తాటి వెంకటేశ్వర్లుతోపాటే బీఆర్‌ఎస్‌లో ఉండి వెన్నుపోటు పొడిచి ఆయన ఓటమికి కారణమయ్యారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వారంతా ఇప్పుడు పొంగులేటి వెనుక ఉండి, ఆదినారాయణకు టికెట్ ఇవ్వాలని ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. 'నేను ఎమ్మెల్యే అయితే మిమ్మల్ని కాళ్లకు చెప్పులు లేకుండా ఎండలో నిలబెడతా..'అని తమకు తాటి వార్నింగ్ ఇచ్చారంటూ కొందరు గతంలో ప్రచారం కూడా చేశారు.

రేవంత్ రెడ్డి వద్ద తాటి లాబీయింగ్

తాటి వెంకటేశ్వర్లు కాంగ్రెస్‌లో చేరాక పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ద్వారా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. పార్టీలో ఎవరైనా ప్రముఖ నాయకులు చేరితే, వారిని కలిసి టికెట్‌కు సాయపడాలని అభ్యర్థిస్తున్నారు. భట్టి విక్రమార్క, రేణుకాచౌదరి, తుమ్మల నాగేశ్వరరావు వంటి వారిని కలుస్తూనే ఉన్నారు. దమ్మపేట మండలం మల్కిపేటలో 2023 ఫిబ్రవరి 6న నిర్వహించిన పొంగులేటి శీనన్న ఆత్మీయుల సమ్మేళన సభలో పొంగులేటి కేసీఆర్ పట్ల తన ధిక్కార స్వరాన్ని తొలుత వినిపించారు. అదే వేదికపై 'ఏ పార్టీలో చేరినా జారే ఆదినారాయణకు అశ్వారావుపేట టికెట్ సాధిస్తాను'అని హామీ ఇచ్చారు. అప్పటివరకు పొంగులేటి తనకు సపోర్టు చేస్తారని భావించిన తాటి కొంత నిరాశ చెందారు. ఇక పార్టీ చీఫ్ రేవంత్ ద్వారా టికెట్ సాధించే ప్రయత్నం చేస్తున్నారు.

జోరుగా బెట్టింగ్‌లు

అశ్వారావుపేటలో ఆదినారాయణకు అనుకూలంగా కృత్రిమ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఐపీఎల్, పేకాట జూదరులతో 20 రోజుల క్రితం ఓ నాయకుడు రహస్య సమావేశం నిర్వహించి, మద్యం, డబ్బు సమకూర్చి ఆదినారాయణకే టికెట్ వస్తుందంటూ బెట్టింగ్ కాయాలని సూచించినట్లు తెలిసింది. ఆయనకు పోటీగా ఎవరూ పందెం కాయట్లేదంటూ ప్రచారం చేయాలని, తద్వారా ఈ సందేశాన్ని ఇటు ప్రజలు, పార్టీ నేతల్లోకి పంపి బీ–ఫామ్ జారేకు సాధించాలని ఆ నాయకుల ఎత్తుగడగా తెలుస్తోంది. టికెట్ ఎవరికి వస్తుందనే విషయమై రూ.లక్ష నుంచి 10 లక్షల వరకు బెట్టింగ్‌లు కూడా జరుగుతున్నట్లు సమాచారం. ఇందుకోసం క్రికెట్ బుకీలు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. వరల్డ్‌కప్‌లో రెండు దేశాల పేరుతో ఈ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇక ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి భట్టి విక్రమార్క ఆశీస్సులతో టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. చాలా కాలంగా పార్టీలో పనిచేస్తున్న ఆమె టికెట్ వస్తుందని నమ్మకం పెట్టుకున్నారు. చివరకు కాంగ్రెస్ అధిష్టానం ఎవరి అభ్యర్థిత్వం ఖరారు చేస్తుందో వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

క్రీడాకారుడికి ఎస్పీ అభినందన


దీక్షిత్‌ను అభినందిస్తున్న ఎస్పీ వినీత్

కొత్తగూడెంటౌన్: క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన, కొత్తగూడెంనకు చెదిన జురుపుల దీక్షిత్, కోచ్ మల్లికార్జున్‌రావును ఎస్పీ అభినందించి మాట్లాడారు. దీక్షిత్ భవిష్యత్‌లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం కోచ్ మల్లికార్జున్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీన కోయంబత్తూరులో జరగనున్న 38వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు షాట్‌పుట్ విభాగంలో దీక్షిత్ ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా ఆర్ఐ (ఎంటీవో) ఓరుసు సుధాకర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మహీధర్, కోచ్ మల్లికార్జున్‌రావు, డి.సుష్మాబాయి, వి.వంశీకృష్ణ, మాన్విత తదితరులు ఉన్నారు.

తూరుబాక బ్రిడ్జిపై మావోల పోస్టర్లు


తూరుబాక బ్రిడ్జిపై వెలిసిన పోస్టర్లు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక బ్రిడ్జిపై తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కమిటీ పేరుతో శుక్రవారం పోస్టర్లు వెలిశాయి. ప్రభుత్వాలను ప్రశ్నించినా.. తమ హక్కులను అడిగిన వారిపై కుట్రపూరితంగా కలంధారి మావోయిస్టులు, అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి, దేశ ద్రోహం నేరం మోపి, ప్రజాస్వామిక హక్కులను ధ్వంసం చేస్తున్నారని పోస్టర్లలో పేర్కొన్నారు. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు శక్తులు కొనసాగిస్తున్న ప్రజావ్యతిరేక సూరజ్ కుండ్ వ్యూహాత్మక దాడిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపా, దేశద్రోహ చట్టాలను రద్దు చేయాలని, ఎన్ఐఏ దాడులు ఆపాలని, అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టిన ఉద్యమకారులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం వచ్చే రాజకీయ నాయకులను ప్రశ్నించాలని, ప్రజాస్వామిక హక్కులను నెలకొల్పే వరకు ఎన్నికలను బహిష్కరించాలని పోస్టర్లలో వివరించారు.

నగదు స్వాధీనం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్తూరు చెక్‌పోస్ట్ వద్ద ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఏపీలోని గణపవరానికి చెందిన శ్రీనివాసరావు వద్ద రూ.2,02,330, బుట్టాయిగూడెంనకు చెందిన బి.వెంకన్నబాబు వద్ద రూ.2,48,000 గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.4,50,380 నగదుకు ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

బైక్ ఢీకొని అక్కాచెల్లెళ్లకు గాయాలు

దమ్మపేట: అతివేగంగా వస్తున్న బైక్ వెనుక నుంచి ఢీకొట్టడంతో మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం మండల కేంద్రంలోని జీడిగింజల గోదాం సెంటర్లో అతివేగంగా వస్తున్న బైక్, మరో బైక్‌ను ఢీకొట్టి.. అటుగా నడుచుకుంటూ వెళ్తున్న అక్కాచెల్లెళ్లు పుష్పలత, మోహినిని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారి కాళ్లు విరిగిపోయాయి. స్థానికులు క్షతగాత్రులను దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి తరలించారు.

భార్యను నరికి చంపిన భర్త

పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు


హత్యకు ఉపయోగించిన గొడ్డలి

మణుగూరుటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ ఘటన మణుగూరులో శుక్రవారం సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. గొట్టిముక్కల రాములు స్థానికంగా ఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మద్యం సేవించే అలవాటు ఉండటంతో భార్య మంగతాయి (65)తో తరచూ గొడవ పడుతుండేవాడు. గురువారం రాత్రి కూడా దంపతుల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య నిద్రిస్తున్న సమయంలో రాములు గొడ్డలితో నరికి హతమార్చాడు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కి వచ్చి లొంగిపోయినట్లు సీఐ రమాకాంత్ వెల్లడించారు. కాగా, ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,231

వేగంగా.. సులభంగా !



- ఎన్నికల సమగ్ర సమాచారం అరచేతిలో..
- అందుబాటులో ప్రత్యేక యాప్‌లు

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానం తోడు కానుంది. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 8న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. వేగంగా సులభంగా క్షణాల్లో సమాచారం తెలుసుకునేలా, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు పలు వెబ్‌సైట్లు, యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటరు నమోదు నుంచి పోలింగ్ వరకు ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చు.

ఓటర్ హెల్ప్‌లైన్



ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా పొందొచ్చు. నూతన ఓటరు నమోదు తోపాటు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. మన పేరు ఎలక్టోరల్ జాబితాలో నమోదైందో, లేదో వెతకవచ్చు. అంతేకాక ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటు వేసే పోలింగ్ కేంద్రంతోపాటు పోటీ చేసే అభ్యర్థి, సమాచారం వివరాలు కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకాక ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులకు కూడా ఈ యాప్ ద్వారా అవకాశం కల్పించారు.

కేవైసీ..



అభ్యర్థుల సమాచారం తెలుసుకునేలా నో యువర్ క్యాండిడేట్ అనే పేరిట ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా యాప్ రూపొందించింది. ఈ యాప్ ద్వారా అభ్యర్థులు ఫొటో, వివరాలు, వారిపై ఉన్న క్రిమినల్ కేసులు, నామినేషన్ పత్రాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది.

సుగమ్



ఎన్నికల్లో పోటీపడే అభ్యర్థులు ప్రచారానికి వాహనాలు వినియోగిస్తుంటారు. వీటికి అనుమతి కోసం సుగమ్ పేరిట యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. అభ్యర్థుల ప్రచారం సందర్భంగా రెండు వాహనాలు వినియోగించాలి. సభలు, సమావేశాల కోసం మరో నాలుగు వాహనాల కోసం ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలి. నియమావళికి విరుద్ధంగా వినియోగిస్తే అధికారులు సీజ్ చేస్తారు. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతులు జారీ చేస్తారు.

సక్షం



దివ్యాంగ ఓటర్ల కోసం సక్షం యాప్ తోడ్పాటు అందిస్తుంది. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని యాప్ రూపొందించారు. ఈ యాప్ ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. మార్పుచేర్పులు, తొలగింపునకు అవకాశం ఉంది. ఓటర్ల జాబితాలో పేరు తెలుసుకోవచ్చు. పోలింగ్ కేంద్రాల వివరాలు బూత్ లోకేటర్ వంటివి పొందుపర్చారు. వీల్‌చైర్, పికప్ అండ్ డ్రాప్ కోసం అభ్యర్థించవచ్చు. ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చు. యాప్‌లో రిజిస్ట్రేషన్, ఫెసిలిటీస్, సెర్చ్, ఇన్ఫర్మేషన్ అండ్ కంప్లైంట్ ఆప్షన్లు కనిపిస్తాయి.

ఈ ఎస్ఎంఎస్ 2.0



ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చాక అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు, ఇతర వస్తువులను సీజ్ చేస్తుంటారు. వీటి వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు ఈ ఎస్ఎంఎస్ యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా ఎంత మొత్తంలో నగదు, మద్యం స్వాధీనం చేసుకున్నారనే విషయాలు ఎన్నికల సంఘానికి ఎప్పటికప్పుడు సమాచారం అందుతుంది.




ఒకే ఒక్కరు!

- భద్రాచలంలో ఏకైక మహిళా ఎమ్మెల్యే
- కొండరెడ్లు.. హ్యాట్రిక్ ఎమ్మెల్యే కూడా ఒక్కొక్కరే


కుంజా సత్యవతి


ముర్ల ఎర్రయ్యరెడ్డి


కుంజా బొజ్జి



భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గం 1952లో ఆవిర్భవించగా ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పలువురు మహిళా అభ్యర్థులు పోటీ పడినా విజయం మాత్రం ఒకరినే వరించింది. 2009 ఎన్నికల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యాన కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన కుంజా సత్యవతి తన ప్రత్యర్థి, సీపీఎం అభ్యర్థి సున్నం రాజయ్యపై గెలిచారు. అలాగే, 1989, 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి దుంగురౌతు సుశీల, 2014లో టీడీపీ తరఫున ఫణీశ్వరమ్మ పోటీ చేయగా విజయం దక్కలేదు. వీరేకాకుండా పలు ఎన్నికల్లో ఇండిపెండెంట్లుగా మహిళా అభ్యర్థులు బరిలోకి దిగినా వెయ్యి లోపు ఓట్లకే పరిమితమయ్యారు.

ఒకే ఒక్క కొండరెడ్డి ఎమ్మెల్యే

16 సార్లు జరిగిన ఎన్నికల్లో భద్రాచలం ఎమ్మెల్యేగా కొండరెడ్డి జాతి నుంచి ఒకరే ప్రాతినిధ్యం వహించారు. కొండరెడ్డి జాతికి చెందిన ముర్ల ఎర్రయ్యరెడ్డి 1978లో సీపీఎం తరఫున పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పి.తిరుపతయ్యపై గెలిచారు. 1983లో మళ్లీ రెండోసారి టీడీపీ అభ్యర్థి అశ్వపతిపై విజయం సాధించారు. దీంతో నియోజకవర్గం నుంచి ఏకైక కొండరెడ్డి ఎమ్మెల్యేగా ఎర్రయ్యరెడ్డి పేరిట రికార్డు నమోదైంది.

హ్యాట్రిక్ కూడా ఒకరికే..

భద్రాచలం నియోజకవర్గంలో హ్యాట్రిక్ విజయం ఒకేసారి నమోదైంది. సీపీఎంకు చెందిన కుంజా బొజ్జి పేరిట ఈ రికార్డు ఉంది. ఆయన 1985, 1989, 1994లో వరుసగా పోటీ చేసి గెలుపొందారు. అలాగే, సీపీఎం అభ్యర్థి సున్నం రాజయ్య మూడు సార్లు గెలిచినా వరుసగా విజయాలు దక్కలేదు.

అశ్వారావుపేట సీపీఎం అభ్యర్థిగా అర్జున్


పిట్టల అర్జున్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పిట్టల అర్జున్ అభ్యర్థిత్వాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ శుక్రవారం ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. ప్రస్తుతం సీఐటీయూ జిల్లా నాయకుడిగా పనిచేస్తున్న అర్జున్ స్వగ్రామం దమ్మపేట మండల ముకుందాపురం. విద్యార్హత బీఏ. ఈయన రాజకీయ జీవితం సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ ద్వారా 1994లో ప్రారంభమైంది. 2011 నుంచి 2021 వరకూ సీపీఎం దమ్మపేట మండల కార్యదర్శిగా పని చేశారు. 2021 నుంచి సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడిగా చేస్తున్నారు.

ముందస్తు అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న డీపీఆర్ఓ శ్రీనివాసరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సర్వీస్ ప్రొవైడర్లు, సెల్ కంపెనీలు బల్క్ ఎస్ఎంఎస్‌లు కానీ, ఐవీఆర్ఎస్ ద్వారా చేసే ఫోన్ కాల్స్ కాని ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ముందస్తు ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తీసుకోవాలని డీపీఆర్ఓ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీపీఆర్ఓ కార్యాలయంలో సర్వీస్ కంపెనీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్ఓ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముందస్తు అనుమతి లేకుండా బల్క్ ఎస్ఎంఎస్‌లు, ఐవీఆర్ ఫోన్‌కాల్స్ చేయడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. సిటీ కేబుల్‌లో ప్రసారమయ్యే ప్రచార కార్యక్రమాలకు సంబంధించి కూడా ముందుగా ఎంసీఎంసీ కమిటీ ద్వారా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎస్పీ కార్యాలయం నుంచి నరేష్, సోషల్ మీడియా కమిటీ సభ్యులు దిలీప్, బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీ సక్రు, సూపరింటెండెంట్ శివరాంజీ, జియో నుంచి బండి విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

పినపాక బరిలో సీపీఐ ఉంటుంది..


మాట్లాడుతున్న అయోధ్య

మణుగూరుటౌన్ /మణుగూరు రూరల్ : పినపాక నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి పోటీలో నిలుస్తారని పార్టీ పినపాక నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శుక్రవారం పార్టీ కార్యాలయంలో పుల్లారెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య మాట్లాడారు. కార్యక్రమంలో మున్నా లక్ష్మీకుమారి, వెంకటేశ్వరరావు, రేసు ఎల్లయ్య, ఆర్.లక్ష్మీనారాయణ, జంగం మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్, ముర్వా వెంకటేశ్వరరావు, అనంత సురేశ్, వాగబోయిన రమేశ్, రాజు, వంగర సతీశ్, కుటుంబరావు, అక్కి నర్సింహారావు, అలవాల సాతారామరెడ్డి, పేరాల శ్రీను, పత్తిపాటి నాగేశ్వరరావు, గద్దం మనోహరచారి, మంగి వీరయ్య, ఎస్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ దాడులు

ఇద్దరు మహిళలు అరెస్టు


అరెస్ట్ చేసిన మహిళలను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

చంద్రుగొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్‌శాఖ అధికారులు గుడుంబ తయారీ స్థావరాలపై దాడులు చేశారు. దుబ్బతండా, వెంకటియాతండా, పోకలగూడెం, వెంగళరావు కాలనీ, టేకులబంజర్, రావికంపాడు, సుంకరబంజర్, చంద్రుగొండ గ్రామాల్లో దాడులు చేసి, 400 లీటర్ల బెల్లం ఊట, 8 లీటర్ల కాపుసారాను పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ తెలిపారు. ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ డి.సాయికుమార్, హెడ్‌కానిస్టేబుల్ జె.ముత్తయ్య, సిబ్బంది ఎస్.కిరణ్, టి.రామారావు, సీహెచ్ మౌనిక పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం గ్రామంలో అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ పోటు గణేశ్ కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రం గుండువారిగుంపు గ్రామానికి చెందిన మాలోత్ రాంపతి ద్విచక్రవాహనంపై 8 లీటర్ల నాటుసారా తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

నాటుసారా సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

కారేపల్లి: ఎక్సైజ్ పోలీసులు చేపట్టిన తనిఖీల్లో నాటుసారా తరలిస్తున్న వ్యక్తి పట్టుబడ్డాడు. కారేపల్లి ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ వెల్లడించిన వివరాలు.. భద్రాద్రి జిల్లా టేకులపల్లికి చెందిన బాలు ద్విచక్రవాహనంపై శుక్రవారం సారా తీసుకెళ్తుండగా జైత్రాం తండా గ్రామం వద్ద గుర్తించారు. ఆయన నుంచి 20 లీటర్ల నాటుసారా, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. అలాగే, కారేపల్లి మండలంలోని వివిధ గ్రామాల బెల్ట్‌షాపుల్లో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేపట్టి 125 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోగా, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ములకలపల్లి: మండలంలోని పాలవాగు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం దాడులు నిర్వహించి, గ్రామానికి చెందిన కిరాణా దుకాణం నిర్వాహకుడు కోంద్రు వెంకటేశ్ వద్ద గల సుమారు రూ.5 వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

పాల్వంచ: అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం మండలంలోని ఉల్వనూరు గ్రామంలోని ఓ కిరాణా షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 మద్యం బాటిళ్లను రూరల్ ఎస్ఐ కార్తీక్ పట్టుకున్నారు. షాపు నిర్వాహకుడు ముగితే బుచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ అశోక్ ఆదేశాల మేరకు పోలీసులు పట్టణ పరిధి బాబూక్యాంపులోని రాజుకు చెందిన బెల్టుషాపులో తనిఖీలు చేసి మద్యం సీసాలను గుర్తించారు. అనంతరం బెల్టుషాపును సీజ్ చేసి రాజుపై కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


శ్రీను (ఫైల్)

మణుగూరుటౌన్: కుటుంబ సభ్యులెవరూ తోడుగా లేకపోవడం, ఒంటరి జీవితంపై విరక్తి చెంది యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మణుగూరులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అక్కినేపల్లి శ్రీను (26) పట్టణంలో ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ సమితిసింగారంలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలం కిందట తల్లిదండ్రులు మరణించారు. ఏడాది కిందట సోదరుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనుకు ఆర్థిక ఇబ్బందులు కూడా తోడవడంతో గురువారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

అశ్వాపురం: మండలంలోని జగ్గారంతండా సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మిట్టగూడెం గ్రామానికి చెందిన వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (60) తన ద్విచక్రవాహనంపై పాల్వంచ నుంచి మిట్టగూడెం వెళ్తున్నాడు. మార్గమధ్యలో జగ్గారం తండా వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వెంకటేశ్వరరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని మణుగూరు ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతుడు హెవీవాటర్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి కాగా, ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. అశ్వాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య వెంకటేశ్వరరెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి...


వెంకటేశ్ మృతదేహం

అశ్వారావుపేటరూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ గిరిజనుడు మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని మల్లాయిగూడెం గ్రామానికి చెందిన కొమరం వెంకటేశ్ (32) గురువారం ద్విచక్రవాహనంపై గాద్రాల గ్రామంలోని తన అత్తగారింటికి వెళ్లాడు. కాగా, శుక్రవారం ఉదయం దబ్బతోగు – మల్లాయిగూడెం మార్గమధ్యలో రక్తపుమడుగులో వెంకటేశ్ మృతి చెంది ఉన్నాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు, బంధువులకు సమాచారం అందించారు. వెంకటేశ్ మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి భార్య సత్యవతి, కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. మృతుడి తల్లి నాగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి...


కరకగూడెం: మండలంలోని పద్మాపురం గ్రామానికి చెందిన సోలం నాగయ్య (58) ప్రమాదవశాత్తు చెరువులో పడి శుక్రవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మృతుడు గేదెల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే గేదెలను గ్రామ శివారులోని చెరువుగట్టుకు మేపుకుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో కండ్లు తిరిగి చెరువులో పడటంతో మృతిచెందడాని తెలిపారు. స్థానికులు కరకగూడెం పోలీసులకు సమాచారం అందిచడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద దిక్కు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

శివాలయంలో చోరీ

ములకలపల్లి: స్థానిక ఉమాపృథ్వీ రామలింగేశ్వర ఆలయ హుండీ చోరీకి గురైంది. స్థానికుల కథనం మేరకు.. గురువారం ఉదయం అయ్యప్ప మాలాధారు లు గుడికి రాగా, హుండీ చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆలయ శివారులోని చెరువు వద్ద హుండీ పగులగొట్టి ఉంది. సమీపంలోనే గడ్డపలుగు పడి ఉండడాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. ఆలయ కమిటీ చైర్మన్ నరాటి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోల విధ్వంసం

రెండు వాహనాలకు నిప్పు


మావోలు దగ్ధం చేసిన వాహనం

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా దండకారణ్యంలో మావోయిస్టులు విధ్వంసం సృష్టించారు. త్వరలో ఛత్తీస్‌గఢ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అయితే, ఎన్నికలు బహిష్కరించాలని పిలుపునిచ్చిన మావోయిస్టులు, ఇప్పుడు సుక్మా జిల్లాలో హింసాత్మక ఘటనలకు పాల్పడ్డారు. సుక్మా జిల్లా కుంట పోలీస్‌స్టేషన్ పరిధి గొల్లపల్లి రోడ్డులో రెండు టాటా మ్యాజిక్ వాహనాలకు శుక్రవారం నిప్పంటించారు. అనంతరం ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిస్తూ కరపత్రాలను వదిలారు.

మందుపాతరను నిర్వీర్యం చేసిన బలగాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో పోలీసులను లక్ష్యంగా చేసుకుని ఏర్పాటుచేసిన మందు పాతరను బలగాలు శుక్రవారం నిర్వీర్యం చేశాయి. దంతెవాడ జిల్లాలోని కిరండోల్ సమీపాన హిరోలి అటవీ ప్రాంతంలో ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ, సీపీ బలగాలు కూంబింగ్ చేస్తున్నాయి. అయితే, వారిని మట్టుబెట్టాలనే లక్ష్యంతో మావోయిస్టులు మందుపాతర ఏర్పాటుచేయగా, బలగాలు గుర్తించాయి. దీంతో బీడీఎస్ బృందం చేరు కుని మందుపాతరను నిర్వీర్యం చేయగా పెను ప్రమా దం తప్పినట్లయింది.



సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ ఖమ్మం ఇల్లందు రోడ్ మరియు వైరా రోడ్‌లో DTCP & Rera అప్రూవుడ్ వెంచర్లో ఓపెన్‌ప్లాట్లు & ఇండ్లు అమ్ముటకు ఏజెంట్స్ కావలెను. కాట్రపల్లి నాగరాజ్. 93993 42239. [M-1221902]

PLOT FOR SALE

■ ఖమ్మం ఇల్లందు రోడ్‌లో DTCP & Rera Approved ఓపెన్ ప్లాట్స్‌లో గజం 12,500/-, ఇండ్లు 70 లక్షలతో క్లబ్ హౌస్ స్విమ్మింగ్ పూల్ సౌకర్యం. సంప్ర॥ కాట్రపల్లి నాగరాజ్, 93993 42239. [M-1221800]

HOUSE FOR SALE

■ ఖమ్మం ఇల్లందు రోడ్‌లో DTCP Rera అప్రూవుడ్ ఇండ్లకి 20 - 25% డబ్బుకట్టి, లోన్‌తో, క్లబ్‌హౌస్, స్విమ్మింగ్ పూల్ కల్గిన అందమైన ఇంటిని స్వంతం చేసుకోండి. కాట్రపల్లి నాగరాజ్. 93993 42239. [M-1221901]

Services

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above / Month Contact : for more info: 7569560745 [H-193278]

■ ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468 [H-788343]

AGRI BUSINESS

■ "పంట కొనుగోలు ఒప్పందం" క్రింద వెదురు సాగు చేయదలచిన రైతులు "అరబుల్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ ", హైదరాబాద్ వారిని సంప్రదించండి. 18008909919 & 9281458305 [H-189441]

Wanted

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ అ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డీటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
కొత్తగూడెం	: 9010223783
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642
మధిర	: 9949927792

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!

గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి. మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటువ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● **తగినంత నిద్ర**
నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.

● **ఫ్లూ టీకాలు**
ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

● **పరిశుభ్రతను పాటించడం**
ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**
తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకలను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.





ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజో మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

లైఫ్@360

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్ళను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్

'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణు గోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌ఏ వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌ఏ వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌ఏ వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.